క్లుప్తంగా

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల కేంద్రంలో శ్రీ సిద్ధారూఢస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బాపురం రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాపురం చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లుకు రూ.20వేలు, రన్నరప్‌కు రూ.10వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 30 జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత చిన్నభూంపల్లి జట్టు

కోసిగి: మండలంలోని కొల్మాన్‌పేట గ్రామంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌లో చిన్నభూంపల్లి గ్రామ జట్టు గెలుపొందింది. ఆదివారం గ్రామంలో చిన్నభూంపల్లి జట్టు, కొల్మాన్‌పేట గ్రామ జట్టుల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి గ్రామ యువ నాయకుడు ఉప్పలపాటి అర్జున్ రూ.10వేలు, ద్వితీయ బహుమతి దాశరథి కిరణ్ కుమార్ రూ.7వేల నగదు అందజేశారు.

శ్రీమఠంలో ప్రత్యేక పూజలు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలతో పోటెత్తారు. భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజామునుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథోత్సవాలపై ఊరేగించారు.

నేడు సిద్ధరూఢ స్వామి మహా రథోత్సవం


పూజలందుకుంటున్న సిద్ధరూఢస్వామి

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన మహా తపస్వి శ్రీ సిద్ధరూఢ స్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరుగనుంది. గ్రామ పెద్దల వివరాల మేరకు.. స్వామి వారు 1758లో కర్ణాటక రాష్ట్రంలో బీదరుకోట గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి గురు శాంతనల్లప్ప, తల్లి దేవమల్లమ్మ. ఐదేళ్ల వయస్సు నుంచే దేశ సంచారం చేస్తూ ప్రజలను భక్తి మార్గం వైపు మళ్లించేవారు. ఈ క్రమంలో పెద్దకడబూరు గ్రామం చేరుకొని కొన్ని రోజులు భిక్షాటన చేసి, స్థానికులకు తన మహిమలను చూపారు. చివరకు కర్ణాటక రాష్ట్రంలోని హుబ్బళి గ్రామంలో జీవ సమాధి పొందారు. దీంతో ఏటా మహారథోత్సవం జరిపిస్తున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదోని రూరల్ : యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా వై.రామాంజనేయులు, సహాధ్యక్షుడిగా హెచ్.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజాహుసేన్, ట్రెజరర్ నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా దావీదు, ఎన్నికల పరిశీలకులుగా పి.నాగలక్ష్మి వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా కార్యదర్శి దేవపాల్, జిల్లా సహ ఉపాధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప, ఐ.కృష్ణమూర్తి హాజరయ్యారు.

శ్రీమఠంలో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం

మంత్రాలయంరూరల్: కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం ఈశ్వరప్ప ఆదివారం రాత్రి మంత్రాలయంకు చేరుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్ర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు శ్రీమఠం అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రాలయం ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నచూపు!

● టీఎస్ డిస్ట్రిబ్యూటరీపై టీబీపీ బోర్డు నిర్లక్ష్యం ● శిథిలావస్థలో సరిహద్దు కాలువ ● మాయమైన మాగాణి


శిథిలావస్థకు చేరిన టీఎస్ కూళ్లూరు డిస్ట్రిబ్యూటరీ కాలువ,


కర్ణాటక వైపు పూడిక తీసిన డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని పంట కాలువ

తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు నిర్లక్ష్యం కారణంగా పచ్చని పైర్ల పరువాలు, సాగునీటి సవ్వడులు మాగాణి సోయగాలు కనుమరుగయ్యాయి. పది మందికి తిండి గింజలు పంచేరోజులు పోయి వరి ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి దాపురించింది. కర్ణాటక, ఆంధ్ర రైతుల సత్సంబంధాల వారిధిగా టీఎస్ డిస్ట్రిబ్యూటరీ కాలువ వెలసింది. బోర్డు చిన్నచూపు మూలంగా కాలువ శిథిలమవడంతో నీటి సరఫరా నిలిచిపోయి వర్షాధార పంటలు సాగు చేస్తున్నారు. దీంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి.


ఆంధ్ర వైపు కాలువ పరిధిలో సాగు చేసిన పత్తి పంట

మంత్రాలయం : తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ ఆంధ్ర సరిహద్దు ఆనవాలు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులను కలుపుతూ టీఎస్ డిస్ట్రిబ్యూటరీ కాలువ ఏర్పాటు చేశారు. దాదాపు 25 కి.మీ. పొడవునా నిర్మించారు. కర్ణాటక, ఆంధ్ర రైతులకు ఈ కాలువ నుంచే నీటిని సరఫరా చేయాల్సి ఉంది. కాలువ పరిధిలో 16 క్యూసెక్కులు ఆంధ్ర రైతులు, 24 క్యూసెక్కులు నీరు కర్ణాటక రైతులకు కేటాయించారు. ఆంధ్ర పరిధిలో ఖరీఫ్‌లో 1,551 ఎకరాలు, రబీలో 2,330 ఎకరాలు, కర్ణాటకలో ఖరీఫ్‌లో 1,479 ఎకరాలు, రబీలో 3,349 ఎకరాలకు సాగునీరు అందాలి. ఆంధ్ర వైపు కౌతాళం మండలంలోని హానవాలు, కుంటనహాలు, ఉప్పరహాల్, రౌడూరు, బాపురం గ్రామాల రైతులకు నీరు ఇచ్చేవాళ్లు, కర్ణాటకలోని వెంకటాపురం, రావెహాల్, అలగనూరు, మాటూరు, టీఎస్ కూళ్లూరు గ్రామాల్లో ఆయకట్టు ఉంది.

కనుమరుగైన మాగాణి..

కాలువ నిర్వహణ పూర్తిగా తుంగభద్ర బోర్డు పరిధిలో ఉంది. ఆంధ్ర అధికారులకు ఎలాంటి అధికారాలు కేటాయించలేదు. బోర్డు అధికారుల పక్షపాతం కారణంగా.. ఒకప్పుడు కాలువ పరిధిలో ఆంధ్ర పొలాల్లో 2 వేల ఎకరాల్లో, కర్ణాటకలో 2,500 ఎకరాల్లో వరి పంటలు సాగు చేసేవాళ్లు. ప్రస్తుతం వరి పంటలు కనిపించడం లేదు. దీంతో మాగాణికి బదులుగా వర్షాధార పంటలు సాగుచేసుకోవాల్సిన దుస్థితి. ప్రస్తుతం పత్తి పంట ఎక్కువగా వేస్తున్నారు. ఇప్పటి వరకు కుంటనహాల్ వరకు మాత్రమే అరకొరగా సాగునీరు సరఫరా అవుతోంది.

శిథిలావస్థలో కాలువ..

అటు ఐదు, ఇటు ఐదు గ్రామాలకు సాగునీరు ఇచ్చే టీఎస్ కూళ్లూరు డిస్ట్రిబ్యూటరీ కాలువ ఒకప్పుడు కల్పతరువుగా వెలుగొందింది. ప్రస్తుతం నిర్వహణ గాలికి వదిలేయడంతో కాలువ ఆనవాలు కనుమరుగవుతున్నాయి. రౌడూరు, బాపురం, ఉప్పరహాల్ ప్రాంతాల్లో కాలువ పూర్తిగా దెబ్బతింది. 18 కి.మీ.మేర కాలువ దుస్థితి అధ్వానంగా మారింది. 1994లో కాలువ లైనింగ్ పనులు చేసి వదిలేశారు. అప్పటి నుంచి పట్టించుకోలేదు. ముళ్లపొదలు, పెరిగి కాలువ పూడిపోయి ఆనవాళ్లు కోల్పోయింది. ఇటీవల కర్ణాటక వైపు ఉన్న పంట కాలువలకు మాత్రమే పూడికతీత పనులు చేపట్టారు. ఆంధ్ర వైపు కాలువలను పట్టించుకోకుండా వదిలేశారు.

16 ఎకరాల్లో వరి వేసేవాళ్లం



కాలువ పరిధిలో మాకున్న 16 ఎకరాల్లో వరి పంట వేసేవాళ్లం. 12 ఏళ్లుగా వరి పైరు వేయడం లేదు. సాగునీరు అందకపోవడంతో కేవలం ఆరుతడి, వర్షాధార పంటలు సాగు చేస్తున్నాం. వరి ధాన్యం అమ్మే స్థితి నుంచి కొనే స్థితికి దిగజారిపోయాం. ఎవరూ మా సమస్యను పట్టించుకోవడం లేదు.

– దివాకర్‌రెడ్డి, ఉప్పరహాల్, రైతు

మాగాణి మాటే లేదు



మా ఊళ్లో ఒకప్పుడు మాగాణి ఎక్కువగా ఉండేది. ఊర్లో సగానికి పైగా రైతులు వరి పంట వేసేవాళ్లు. మేము 15 ఎకరాల్లో సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం వరి మాగాణి అన్న మాటే లేదు. ఊరంతా కలిపి 20 ఎకరాల్లో కూడా సాగు కావడం లేదు. కాలువ నిర్వహణ పూర్తిగా వదిలేయడంతో ఈ పరిస్థితి దాపురించింది.

– బీటీ మారెప్ప, రైతు

బోర్డు అధికారులు పట్టించుకోవాలి



బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలువ పరిధిలో ఆయకట్టు రోజురోజుకు తగ్గిపోతూ వచ్చింది. రైతుల కష్టాలను వారు పట్టించుకోవడం లేదు. కారణంగా నాలుగు గ్రామాల రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. గతంలో 20 ఎకరాల్లో మా నాన్న వాళ్లు వరి పంట వేసేవాళ్లు. ప్రస్తుతం నీటి వసతి లేక పత్తి సాగు చేస్తున్నాం.

– లింగన్న, మాజీ సర్పంచు, ఉప్పరహాల్

బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయమని, ప్రతిఒక్కరు భక్తిభావంతో మెలగాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, రాజయోగి పంచయ్య స్వామి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో సర్వధర్మ సమ్మేళన కార్యక్రమాన్ని పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బ్రహ్మకుమారీలు సమాజ శ్రేయస్సు కోసం తమ వంతుగా కృషి చేస్తున్నారన్నారు. నిత్యం దైవ సన్నిధిలో ఉంటూ దైవ సంబంధ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. దేవిశెట్టిప్రకాష్, ప్రేమ్‌కుమార్ ఫాదర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సువిధ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ స్టాపింగ్

ఆదోని అర్బన్ : యశ్వంతపూర్– జైపూర్‌కు వెళ్లే వీక్లీ సువిధ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్‌నం.82653, 82654) రైలు ఎట్టకేలకు ఆదోని రైల్వేస్టేషన్‌లో నిలిపేలా సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ సలహా మండలి సభ్యుడు, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆయన సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ అధికారులకు విన్నవించారు. ఈ ప్రాంతం నుంచి వ్యాపారులు, ఉద్యోగులు వివిధ పనులపై జైపూర్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రతి గురువారం ఈ రైలు కర్ణాటకలోని యశ్వంతపూర్‌లో బయలుదేరి అదేరోజు గుంతకల్, మంత్రాలయం మీదుగా జైపూర్‌కు వెళ్తుందన్నారు. గుంతకల్, మంత్రాలయం మాత్రమే నిలుపుతుండటంతో తమ ప్రాంతవాసులు ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లడంతో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు స్టాపింగ్‌కు అనుమతినిచ్చారని ఎమ్మెల్యే ఆదివారం తెలిపారు.

వైభవంగా ‘పులిగట్టు’ ఉత్సవాలు


పూజలందుకుంటున్న స్వామి


భక్తుల సందడి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఒకటైన ఏరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే తరలివచ్చారు. తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారు జామునుంచే భక్తులు స్వామిని దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. భక్తులు తరలిరావడంతో కొండ కిటకిటలాడింది. దర్శనానికి గంటకుపైగ సమయం పట్టింది. మొక్కుబడిలో భాగంగా వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పూజలు ఉంటాయని, సోమవారం సాయంత్రం స్వామి పల్లకోత్సవం ఉంటుందని, కొండ దిగి రాత్రంత గ్రామంలో ఊరేగించిన అనంతరం మంగళవారం ఉదయం పల్లకీ కొండ చేరుతుంది. దీంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. పోలీసులు బందబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


ఆదోనిలో శివాజీ చిత్ర పటం ఊరేగింపు


శివాజీ విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: పట్టణంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతిని ఛత్రపతి శివాజీ సంఘం నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో శివాజీ చిత్రపటాన్ని అంబాభవానీ ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. శివాజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

కోసిగి: మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రైల్వే గేటు సమీపంలోని సిద్ధరూఢ శాంత్రాశమంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ నూతన విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. మధ్యాహ్నం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని కలశాలతో ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన గౌడ, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, హొలగుంద కోసిగయ్య, వక్రాని వెంకటేశ్వర్లు, బుళ్లి నరసింహులు, జేరుంబడి నరసింహులు పాల్గొన్నారు.

నాటుసారా, మద్యం విక్రయదారుల అరెస్ట్


నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

ఆదోని రూరల్ : పట్టణ సమీపంలోని సింగరాజు మల్లై కొండపై సెబ్ సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో నాటుసారా బట్టీపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో వాల్మీకి నగర్‌కు చెందిన బోయ హరికృష్ణ, బి.రమేష్‌ను అదుపులోకి తీసుకుని, 400 లీటర్ల ఊటను ధ్వంసం జేసి, నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలోని ఇందిరానగర్‌లోని హెచ్.రవి, క్రాంతినగర్‌లోని కె.రవి వద్ద ఉన్న 40 ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత చాటుకుంటున్న దేవరగట్టు క్షేత్రంలో ఆదివారం స్వామి వారం కావడంతో మాళమల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో పూజారులు మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, భండరార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన తదితర పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదం అందజేయగా ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఉచ్ఛాయోత్సవం

హొళగుంద: ముద్దటమాగి గ్రామంలో వెలిసిన సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్ఛాయోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉచ్ఛాయంలో ప్రతిష్ఠించిన స్వామి చిత్రపటానికి ఆలయ పూజారులు మహామంగళారతి, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్థానిక తేరు బజారులో ఉచ్ఛాయాన్ని ఎదురు బసవన్న కట్ట వరకు లాగారు. ఉచ్ఛాయోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గుమ్మనూరు శ్రీనివాసులు, టీడీపీ ఆలూరు ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ, జెడ్పీటీసీ విరుపాక్షి పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం


దొడ్డిమేకలలో పూజలందుకుంటున్న చంద్రమౌళీశ్వరస్వామి

పెద్దకడబూరు : శివనామ స్మరణలతో మండలంలోని దొడ్డిమేకల, హెచ్.మురవణి గ్రామాలు మార్మోగాయి. ఆదివారం దొడ్డిమేకల ఈశ్వర ఆలయంలో చంద్రమౌళీశ్వరస్వామి, హెచ్.మురవణి గ్రామంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి అర్చకులు వీరభద్రయ్యస్వామి, వీరయ్యస్వామి, వీరేష్ స్వామి, భూషన్నస్వామి ఉదయం నుంచి కుంకుమాభిషేకం, పుష్పాభిషేకం, పాలాభిషేకం, విభూతి అభిషేకం, గంధాభిషేకం, జలభాషేకం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దొడ్డిమేకలలో కల్యాణోత్సవం చేపట్టారు. గ్రామస్తులు పిండివంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గజ్జహళ్లి వెంకటరామిరెడ్డి ఇంటి నుంచి, హెచ్.మురవణి గ్రామంలో జంగం భూశయ్య ఇంటి నుంచి కుంభాలు రథం దగ్గరికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వాముల ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి మంగళవాయిద్యాలు, మహిళలు కళశాలతో ముందు నడవగా, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథం ముందుకు సాగింది. బొడ్రాయి వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రాఘవేంద్రనగర్‌లో వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పాతవూరులో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే.. మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో తిమ్మ అవధూత 50వ రథోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా సాగింది. ముందుగా సంప్రదాయం ప్రకారం ఆచార్యుల ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని తీసుకుచ్చి స్వామి వారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి రథోత్సవాన్ని భక్తుల కోలాహలం మధ్య వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


మురవణిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

5న రేణుకాచార్యుల జయంతి

ఆదోని అర్బన్ : సామాజిక క్రాంతి దాత రేణుకాచార్యుల జయంతోత్సవాలను వచ్చే నెల 5వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జంగమర సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు గురునాతయ్య, విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని చౌకీమఠంలో సంఘం పాలకవర్గం సమావేశంలో ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల రోజు తెల్లవారుజామున పేట వీరభద్రస్వామి, రేణుకాచార్యుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యాచార్య కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం రేణుకాచార్యుల ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందని, ఇందుకు పాల్తూరు కళ్లు హోలే మఠం పీఠాధిపతి చిన్నవీరశివాచార్య మహాస్వామిజీ, చౌకీ మఠం పీఠాధిపతి మరిరాయచోటి మహాస్వామిజీ, జంగమరహాసళ్లి పురవర్గా మఠం పీఠాధిపతి శంభులింగ శివయోగిశివచార్యుల స్వామిజీ, రౌడకుంది హియర్‌మఠం పీఠాధిపతి శివయోగి శివాచార్యమహాస్వామిజీ, కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధమహాస్వామిజీ, కోటకళ్లు మఠం స్వామిపరమేశ్వరయ్య హాజరవుతారని చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీరామదేవర, శ్రీ కాశీ విశ్వనాథ, శ్రీ ఆంజనేయస్వామి 16వ రథోత్సవం పురస్కరించుకుని గ్రామవాసి శ్రీ చిదానంద అవధూత వారి జీవిత ఆశయంపై గ్రామ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆదినారాయణ మాట్లాడుతూ పోటీల్లో 86 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి వీఆర్వో మార్లబండి రంగస్వామి ప్రథమ బహుమతి రూ.1,100, రెండో బహుమతి రూ.700, మూడో బహుమతి రూ.500 అందజేశారు.

ఘనంగా ఉరుసు

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన దివానే మస్తాన్ వలి స్వామి 37వ ఉరుసును గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమను గుర్రంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు.

రమణీయం.. జెట్టెప్పతాత రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు,


బండ లాగుతున్న ఎద్దులు

కౌతాళం: మండలంలోని రౌడూరు గ్రామంలో వెలసిన జెట్టెప్పతాత, లక్ష్మన్నతాత, శంకరప్పతాతల ఉత్సవాలను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వాముల వారి 66వ జాతర సందర్భంగా భక్తులు 150 గండదీపాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి పిండి వంటలను నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా స్వామి వారి పల్లకీని గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం వందలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం జరిగింది. వేడుకను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచేకాక కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వీరభద్రతాతకు తులాభారం కార్యక్రమం చేపట్టారు.

ఉల్లాసంగా బండలాగుడు, క్రీడల పోటీలు..

జాతర సందర్భంగా గ్రామంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. అలాగే కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం ఇస్కాన్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.


జగన్నాథ్, బలదేవ్, సుభద్రకు హారతి ఇస్తున్న దృశ్యం

కమనీయం.. ఆదిదంపతుల కల్యాణోత్సవం


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఆస్పరి: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బిణిగేరి సమీపంలో శ్రీగిరి క్షేత్రంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు వైద్యం రాజస్వామి, అనిల్ స్వామి, సంతోష్ స్వామి వేద మంత్రాలతో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. ఆలయంలో పంచలింగేశ్వర స్వామికి గంగపూజ, కుంభోత్సవం నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహలను నందికోలు సేవ, గంధం సేవ మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం గొరవయ్యల పాలసేవ, నృత్యం, మండలంలోని చిగిళి గ్రామానికి చెందిన నాగలింగయ్య స్వామి చెప్పిన వీరభద్ర స్వామి ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఓం నమఃశివాయ నామ స్మరణంతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది.